క్లుప్తంగా

సెల్‌ఫోన్ వద్దు..

నంద్యాల(రూరల్): విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసకాకుండా పుస్తకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నంద్యాల ఎంపీపీ శెట్టిప్రభాకర్ సూచించారు. శనివారం మండలంలోని భీమవరం గ్రామ ఎంపీయూపీ పాఠశాలలో సదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి చదువులు చదివి తమ తల్లిదండ్రులు, గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంపీటీసీ రఘురామిరెడ్డి, మాజీ సర్పంచ్ బంద్రాబస్, ఫౌండేషన్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

నంద్యాల(వ్యవసాయం): గతేడాది పదో తరగతి ప్రశ్న పత్రం లీకేజీలో సస్పెండ్ అయిన అంకిరెడ్డిపల్లె ఉపాధ్యాయులు పోలీస్ స్టేషన్‌లో ఉండాలనే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌వీ కృష్ణారెడ్డి, కె.కృష్ణారావు కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నాడు సస్పెండ్ అయిన ఉపాధ్యాయులు పది పరీక్షలు జరిగినన్ని రోజులు పోలీస్ స్టేషన్‌లో కూర్చోవాలని జిల్లా ఎస్పీ ఉత్వర్వుల మేరకు డీఈఓ ఆదేశాలు జారీ చేయడం ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఉందని ఆక్షేపించారు. విజయరావు, సుమయూన్, జగదీష్, దస్తగిరి, కలీముల్లా, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

పోటా పోటీగా వేలం పాటలు



శిరివెళ్లలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: శనివారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ మార్కెట్ల వేలం పాటలు పోటా పోటీగా జరిగాయి. సర్పంచు సాలమ్మ అధ్యక్షతన జరిగిన వేలంలో పంచాయతీకి గతేడాది కంటే భారీగా ఆదాయం సమకూరింది. గతేడాది రూ.13.15 లక్షలు ఆదాయం రాగా నేడు రూ.17.46 ఆదాయం లభించింది. వారపు సంతకు నిర్వహించిన బహిరంగ వేలంలో ఇస్మాయిల్ రూ.7.96 లక్షలకు, దిన మార్కెట్‌ను కూడ రూ.9 లక్షలకు సొంతం చేసుకున్నాడు. కబేళాను రూ. 50 వేలకు రియాజ్ దక్కించుకున్నారు. వేలాలను డీఎల్‌పీఓ రాంబాబు పర్యవేక్షించారు.

రుద్రవరం: స్థానిక మేజర్ పంచాయతీ సచివాలయంలో శనివారం ఈఓ మహ్మద్‌రఫి, సర్పంచ్ బైరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో వారపు సంత, దిన, జంతు వధశాల మార్కెట్‌లకు వేలం నిర్వహించారు. 12 మంది కాంట్రాక్టర్లు పోటీ పడి వేలం పాడటంతో మేజర్ పంచాయతీకి వారపు సంతకు రూ.8.01లక్షలు, దిన మార్కెట్‌కు రూ.3.11 లక్షలు, జంతు వధశాలకు రూ.8,100 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు

శిరివెళ్ల: చిరుధాన్యాలతో పోషక విలువలు ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ తెలిపారు. పోషకాపదార్థాల వారోత్సవాల్లో భాగంగా శనివారం శిరివెళ్ల, గోవిందపల్లె, యర్రగుంట్ల గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాల ప్రదర్శన నిర్వహించారు. ఆమె మాట్లాడుతు జొన్నలు, సజ్జలు, కొర్రలు, రాగుల వాడకంతో ఐరన్, కాల్షియం, సూక్ష్మపోషకాలు అందుతాయన్నారు. దీంతో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

నంద్యాల(వ్యవసాయం): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఏపీఎస్ ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తుందని జిల్లా ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 3 నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు రాసే విద్యార్థులకు వారి గ్రామం నుంచి పరీక్ష కేంద్రం వరకు అన్ని పల్లె వెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. ఇందుకు విద్యార్థులు తమ పరీక్ష హాల్‌టికెట్లు చూపిస్తే అనుమతిస్తారని పేర్కొన్నారు.

బైక్‌లు ఢీ..నలుగురికి గాయాలు

ఆళ్లగడ్డ: పట్టణ పరిధిలోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో శనివారం రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొన్న సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణానికి చెందిన అశోక్.. తల్లి మద్దిలేటమ్మ, అత్త సావిత్రితో కలిసి మోటార్ సైకిల్‌పై యాగంటిపల్లెకు వెళ్తుండగా.. నరేష్ కోవెలకుంట్ల నుంచి ఆళ్లగడ్డకు వస్తుండగా రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఢీ కొన్నాయి. ఇందులో నలుగురు తీవ్రంగా గాయపడటంతో స్థానిక వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు.

ఉపకార వేతనాలకు ఎంపిక

ఆళ్లగడ్డ: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన నమృత, మయూరి అనే విద్యార్థినులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఫర్హత్ నసీమ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి చదువుతున్న వీరికి నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు.

శిరివెళ్ల: యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి గంధం వినయ్ జాతీయ ప్రతిభా ఉపకార వేతనానికి ఎంపికయ్యాడు.

ప్రగతి మెరిసే.. పల్లె మురిసే

- రూ. 3.88 కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రారంభోత్సవానికి ముస్తాబు
- నేడు ప్రారంభించనున్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



బోడెమ్మనూరులో రైతు భరోసా కేంద్రం



బోడెమ్మనూరులో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనం



గడప గడపకు మన ప్రభుత్వంలో నిర్మించిన సీసీ రోడ్డు

ఉయ్యాలవాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతున్నాయి. సచివాలయ వ్యవస్థతో పల్లెల్లో పట్టణశోభ నెలకొంది. ప్రభుత్వ కార్యాలయాలను అన్ని హంగులతో నూతనంగా నిర్మిస్తుండడంతో గ్రామాల్లో ప్రగతి కాంతులు విరజిమ్ముతున్నాయి. మండలంలోని బోడెమ్మనూరు గ్రామంలో రూ.3.88 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులతో గ్రామ రూపురేఖలు మారాయి. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలు నిర్మించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎస్సీ కాలనీలో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. అలాగే రూ.55 లక్షల ఎంపీ ల్యాండ్స్ నిధులతో గ్రామంలోని సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.42 లక్షలతో అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. అంతర్గత రహదారులు, సీసీ రోడ్లు నిర్మించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవన సముదాయాలను ప్రారంభించేందుకు ఈ నెల 26వ తేదీన ముహూర్తం ఖరారైంది. ఇందుకు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మండలి విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రానున్నారు.

సేవలన్నీ గ్రామంలోనే



ప్రజలకు కావలసిన సేవలన్నీ గ్రామంలోనే అందుతుండడం చాలా ఆనందంగా ఉంది. సచివాలయ వ్యవస్థ ద్వారా మండల,జిల్లా కేంద్రాలకు వెళ్లే వ్యయప్రయాసలు తగ్గాయి. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, రసాయనిక ఎరువులు, సాంకేతిక పరిజ్ఞానం అందుతుంది. వైఎస్సార్ క్లినిక్‌తో వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.
– ఈశ్వరరెడ్డి, బోడెమ్మనూరు

ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం



ఎస్సీ కాలనీలో అంతర్గత రహదారులు లేక ఇబ్బందులు పడేవాళ్లం. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డికి కాలనీ ప్రజలంతా కలిసి సమస్యను తెలుపుకోవడంతో సీసీ రోడ్డు, మురుగు కాలువలు ఏర్పాటు చేశారు. చాలా త్వరగా స్పందించి పనులు చేయించడం అభినందనీయం.
– సి.చెన్నయ్య, బోడెమ్మనూరు

3నుంచి పది పరీక్షలు

ఉయ్యాలవాడ : ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండల కేంద్రంలో 303 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 178 మంది విద్యార్థులు, మోడల్ స్కూల్ కేంద్రంలో 195 మంది రెగ్యులర్ విద్యార్థులు, 30 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాలకు సంబంధించి చీఫ్ సూపర్‌వైజర్లుగా వెంకటశకుంతల, నూర్జహాన్, డిపార్ట్‌మెంటల్ అధికారులుగా దస్తగిరిరెడ్డి, సుధాకర్ నియమితులయ్యారు. ఇప్పటికే రెండు సెట్ల ప్రశ్న పత్రాలు పోలీస్ స్టేషన్‌లో భద్రపరచినట్లు చీఫ్ సూపర్‌వైజర్లు శనివారం తెలిపారు.

విద్యుత్ శాఖకు రూ. 36 లక్షలు నష్టం

ఉయ్యాలవాడ : ఈ నెల 17న కురిసిన అకాల వర్షాలకు 245 11 కేవీ, 49, 33 కేవీ విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ శాఖకు రూ. 36 లక్షలు నష్టం వాటిల్లిందని ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 90 శాతం పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయన్నారు. అన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామని చెప్పారు. వ్యవసాయానికి సంబంధించి మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నట్లు పేర్కొన్నారు.

వార్డెన్ సస్పెన్షన్

నంద్యాల: పాణ్యం మండలం నెరవాడమెట్ట గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఇటీవల విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఘటనపై కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ విచారణకు ఆదేశించారు. ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు విచారణ చేసి నివేదిక సమర్పించగా వార్డెన్ పద్మావతిని సస్పెండ్ చేసినట్లు డీఆర్‌ఓ పుల్లయ్య శనివారం తెలిపారు.

సమస్యలకు పరిష్కారం



నేడు నూతనంగా ఏర్పాటు చేసిన కల్వర్టు

నంద్యాల(అర్బన్): ఇటీవల 14వ వార్డులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి సమస్యలు తెలుసుకొని తక్షణ పరిష్కారం చూపడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఉన్న సప్తగిరి అపార్టుమెంట్ వద్ద ఉన్న డ్రైనేజీతో స్థానికుల ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వార్డు ఇన్‌చార్జ్ సోమశేఖర్‌రెడ్డికి కల్వర్టులు, సీసీ రోడ్లు, ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన రూ.28 లక్షల సాధారణ నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో వార్డులో 4సీసీ రోడ్లు, 13 కల్వర్టులను ఏర్పాటు చేశారు.

సమష్టిగా మత్తు పదార్థాల నియంత్రణ



మాట్లాడుతున్న జేసీ నిశాంతి, చిత్రంలో ఎస్పీ

నంద్యాల: జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మత్తు పదార్థాల నియంత్రణపై జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ, అటవీ శాఖలు తమ పరిధిలోని వ్యవసాయ పొలాల్లో అక్రమ గంజాయి సాగును గుర్తించి పూర్తిగా నియంత్రించాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన వ్యక్తులను గుర్తించి డీ అడిక్ట్ సెంటర్‌లలో చికిత్స ఇచ్చి కౌన్సెలింగ్ ఇవ్వాలని వైద్యాధికారులకు సూచించారు. తూర్పు ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే గంజాయి, డ్రగ్స్ పై నిఘా ఉంచి వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తులు సింథటిక్ డ్రగ్స్ వాడకుండా ప్రిస్క్రిప్షన్ మేరకు మందులు ఇవ్వాలని మెడికల్ షాప్ యజమానులను ఆదేశించాలన్నారు. డ్రగ్స్ నియంత్రణలో భాగంగా ఇప్పటి వరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, సివిల్ పోలీసులు 8 కేసులు నమోదు చేసి, 80 కేజీల గంజాయి సీజ్ చేసి 52 మంది ముద్దాయిలను అరెస్టు చేశారని, ఇంకా 9మంది పరారీలో ఉన్నారని వివరించారు. అడిషనల్ ఎస్పీ ఆర్.రమణ, డీఆర్‌ఓ పుల్లయ్య, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ ప్రసాదరావు, డీసీహెచ్ఎస్ జఫరుల్లా పాల్గొన్నారు.

రసవత్తరంగా ఎద్దుల బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి

గోస్పాడు: ఉగాది పండుగను పురస్కరించుకొని గుమ్మిత మల్లికార్జునస్వామి, శ్రీవీరభద్రస్వామి తిరునాల సందర్భంగా దీబగుంట్లలో రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీల్లో శనివారం సీనియర్ విభాగం పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలను రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి ప్రారంభించారు. పోటీల్లో ఆరు జతల ఎద్దులు పాల్గొనగా నంద్యాల జిల్లా బిల్లలాపురం గ్రామానికి చెందిన భూమా గోవర్ధన్‌రెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.60వేలు గెలుపొందాయి. నంద్యాల జిల్లా జిల్లెల్ల గ్రామానికి చెందిన గొటికె రవితేజారెడ్డి ఎద్దులు రెండో స్థానంలో నిలిచి రూ.40వేలు సొంతం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా పల్లికురువ గ్రామానికి చెందిన పీవీఎస్ఆర్ బుల్స్ పావులూరి వీరస్వామి ఎద్దులు మూడో స్థానం సాధించి రూ.30వేలు గెలుపొందాయి. అదే యజమానికి చెందిన ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచి రూ.20వేలు దక్కించుకున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్ననాగిరెడ్డి, ఉపమండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రిటైర్డు వీఆర్‌ఓ మామహేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి బాసట

- అట్టహాసంగా మూడో విడత ఆసరా సంబరాలు



మెగా చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



సమావేశానికి హాజరైన లబ్ధిదారులు

ఆళ్లగడ్డ: మహిళల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా వివిధ రకాల పథకాలను అమలు చేస్తుందని, వాటిలో వైఎస్సార్ ఆసరా ఒకటని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మూడో విడత ఆసర నిధుల విడుదలలో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు 600 హామీలు ఇచ్చి అధికారంలో ఉన్న ఐదేళ్లలో కనీసం ఆరు హామీలనైనా అమలు చేశాడా అని ప్రశ్నించారు. ఆ మ్యానిఫెస్టో ప్రతులు ఎక్కడ కనిపించకుండా దాచిన చరిత్ర టీడీపీది అన్నారు. మ్యానిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి నిత్యం కళ్ల ముందు కనిపించేలా ఉంచి అందులోని హామీలు వంద శాతం అమలు చేసిన ఏకైక సీఎంగా జగనన్న ఖ్యాతిగాంచారని కొనియాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే బ్యాంకుల్లో ఉన్న పొదుపు మహిళల రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన హామీ మేరకు నేడు ఆసరా పథకం కింద నిధులు చెల్లిస్తున్నారని చెప్పారు. అనంతరం ఆసరా మెగా చెక్కు విడుదల చేశారు. మహిళా సంఘాల సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రమేష్ బాబు, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఏసీ దానం, మున్సిపల్ వైస్ చైర్మన్, మరియమ్మ, సింగం వెంకటేశ్వర్ రెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు

మండలాల వారీగా ఆసరా నిధుల విడుదల ఇలా..

మండలం	లబ్ధి పొందిన గ్రూపులు	సభ్యులు	మొత్తం
ఆళ్లగడ్డ టౌన్	705	7,459	రూ. 4,93,02,400
దొర్నిపాడు	347	3,542	రూ. 1,93,43,386
శిరివెళ్ల	972	10,041	రూ. 8,31,63,942
రుద్రవరం	662	6,854	రూ. 4,59,28,086
చాగలమర్రి	318	3,874	రూ. 1,63,83,302
ఉయ్యాలవాడ	291	3,158	రూ 1,48,46,097
ఆళ్లగడ్డ రూరల్	454	4,687	రూ.2,92,46,529

పంచాయతీకి ఆదాయం

శిరివెళ్ల: యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో సర్పంచు అయ్యలూరి సుభహాన్ అధ్యక్షతన 2023–24కు సంబంధించి శనివారం మార్కెట్ల బహిరంగ వేలం నిర్వహించారు. దిన, వార, కబేళా వేలంలో పంచాయతీకి రూ. 12.64 లక్షలు ఆదాయం సమకూరింది. గతేడాది రూ.10.96 లక్షలు ఆదాయం వచ్చింది. ఈఓఆర్డీ సాల్మన్‌రాజు, ఉప సర్పంచు ప్రతాపరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: చాగలమర్రి మేజర్ పంచాయతీలో వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు శనివారం నిర్వహించిన వేలంలో పంచాయతీకి ఆదాయం పెరిగింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓ సదర్శన్ రావు ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా బస్టాండు వేలం రూ 7.15 లక్షలు, బండ్ల మెట్ట, వారపు సంత రూ 2.01 లక్షలు, కబేలా రూ.99 వేలకు కాంట్రాక్టర్లు దక్కించుకున్నారని ఈఓ తెలిపారు.

పది పరీక్షలకు పటిష్ట భద్రత

నంద్యాల(సిటీ): ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరిగే పది పరీక్షలు పటిష్ట భద్రత నడుమ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డితో జరిగిన సమావేశంలో పరీక్షలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. గతేడాది పరీక్షల్లో చోటుచేసుకున్న అవకతవకలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ చెప్పారన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో జరిగిన పరీక్షల మాల్‌ప్రాక్టీస్, ప్రశ్నాపత్రాల లీకేజీలో సస్పెండ్ అయిన 21 మంది ఉపాధ్యాయులను పరీక్షలు జరిగే ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు వారు విధులు నిర్వహించే సంబంధిత మండల పరిధిలోని పోలీసు స్టేషన్లలో ఉంచాలని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ నెల 21న ఉత్తర్వులు జారీ చేశామన్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 8 మంది ఉపాధ్యాయులను పోలీసు స్టేషన్లలో ఉంచి నిఘా ఉంచాలని సంబంధిత డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేశామని, మిగిలిన 13 మంది సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కర్నూలు డీఈఓకు లేఖ రాసినట్లు వివరించారు.

ఎస్టీ జాబితాలో చేర్చొద్దు

నంద్యాల(అర్బన్): అన్ని విధాల అభివృద్ధి చెందిన వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరిస్తే సహించేది లేదని ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ నాయక్ తెలిపారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దంటూ సంఘం నాయకులు శనివారం బొమ్మలసత్రం వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

నంద్యాల(వ్యవసాయం): దళిత క్రైస్తవులను ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ నాయకులు శనివారం కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు.

మద్యం దుకాణాల తనిఖీ

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు నర్సాపురం మెట్ట వద్దనున్న రెండు మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ అస్లాంబేగ్ మాట్లాడుతూ డెకాయ్ ఆపరేషన్‌తో పాటు తనిఖీలు చేశామన్నారు. దుకాణాల్లో నిర్ణీత ధరలకు విక్రయాలు, లిక్కర్ బ్రాండ్లపై ఆరా తీసి అదే విషయాలపై సూపర్‌వైజర్లు, సేల్స్ సిబ్బందికి అవగాహన కల్పించారు.

టీకాలతో చిన్నపిల్లలకు రక్షణ

గోస్పాడు: చిన్న పిల్లలకు టీకాల ద్వారానే వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని నంద్యాల జిల్లా రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ కాంతరావునాయక్ తెలిపారు. మండలంలోని కానాలపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలకు నిర్ణీత సమయానికి వ్యాక్సిన్లు తప్పని సరిగా వేయించాలన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు 24గంటలోపు సంబంధిత ఆసుపత్రుల్లో బర్త్‌డోస్ టీకాలు, బీసీజీ, హెపటైటిస్ బీ, రెండు పోలియో చుక్కలు వేయించాలని చెప్పారు. వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి

శిరివెళ్ల: మండల కేంద్రంలోని ఇంటింటికీ మంచినీటి కుళాయి ఏర్పాటు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని సర్పంచు దూదేకుల ఉశేనిబీ అన్నారు. శనివారం జల జీవన్ మిషన్‌పై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీలో కుళాయిలపై సర్వే చేశారని,కుళాయిలు లేని గడపలను గుర్తించి ఏర్పాటు చేస్తామని చెప్పారు. జల జీవన్ మిషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : సుద్దమల్ల గ్రామంలో లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ అభయాంజనేయస్వామి ఆలయాల్లో శనివారం అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు కమలేష్‌శర్మ, లక్ష్మణస్వామి, భాస్కరశర్మ తీర్థప్రసాదాలు అందజేశారు.







ఎర్రగుడిదిన్నెలో వెల్‌నెస్ సెంటర్,ఓహెచ్ఎస్ఆర్‌ల వద్ద పనులు చేస్తున్న దృశ్యం, పేరూరులో గ్రామ సచివాలయానికి తుది మెరుగులు దిద్దుతున్న కూలీలు,కోటకొండలో పనులు పూర్తయిన సీసీ రోడ్డు

గ్రామసీమల్లో నవోదయం

- గ్రామాల్లో పూర్తయిన పలు అభివృద్ధి పనులు
- ఈనెల 27న ప్రారంభించనున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే
- రూ.4.40 కోట్ల పనులకు తుది మెరుగులు



కోటకొండలో ఒకే స్థలంలో నిర్మితమైన భవనాలు

రుద్రవరం: మండలం దాదాపు రూ.4.35కోట్లతో పలు అభివృద్ధి పనులతో ఆయా గ్రామాలకు నూతన శోభ వచ్చింది. పనులు పూర్తయిన వాటిని ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి ఈనెల 27వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ మేరకు ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆయా పనుల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రారంభోత్సవాలపై ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, పీఆర్ ఏఈ వెంకటరాముడు శనివారం మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని అభివృద్ధి పనులకు తుది మెరుగులు దిద్దుతున్నామని చెప్పారు.

గ్రామాలు.. పూర్తయిన పనులు, విలువ మొత్తం..

- నల్లవాగుపల్లెలో రూ.7 లక్షలతో రెండు సీసీ రోడ్లు
- చిత్రేనిపల్లెలో రూ.79.30 లక్షలతో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలు
- ఆలమూరులో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో ఆర్‌బీకే
- టీ.లింగందిన్నెలో రూ.4.13లక్షలతో ప్రహరీ నిర్మాణం
- నక్కలదిన్నె మెట్ట నుంచి గ్రామంలోకి రూ.35 లక్షలతో తారురోడ్డు నిర్మాణం
- బీ.నాగిరెడ్డిపలెలో రూ.17.60 లక్షలతో రెండు సీసీ రోడ్లు
- ఎర్రగుడిదిన్నెలో రూ.17.50 లక్షలతో వెల్‌నెస్ సెంటర్, రూ.20 లక్షలతో ఓహెచ్ఎస్ఆర్, రూ.4 లక్షలతో పశువైద్యశాల
- పేరూరులో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం
- ఎల్లావత్తులలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం
- శ్రీరంగాపురంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనాలు
- కోటకొండలో రూ.21.80 లక్షలతో ఆర్‌బీకే, రూ.17.50 లక్షలతో వెల్‌నెస్ సెంటర్, గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన రూ.20 లక్షలతో సీసీరోడ్లు
- కే.కొత్తూరులో రూ.9.80 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.